జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
శనివారం | 14 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 10

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం



జగిత్యాల, నవంబర్ 13, ప్రజా జ్యోతి.. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లువెల్లడించారు.ఈ పథకంఅమలుపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి బీమా రక్షణ కల్పిస్తామన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుడికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. నవంబర్ 14 నుంచి విస్తృత ప్రచారం చేపట్టి,నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా ప్రజలకు

మిగతా 2 లో...



రబీ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై
రైతులకు అవగాహన కల్పించాలి

- వరి సాగుకు బదులుగా ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం – రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.

జగిత్యాల, నవంబర్ 13, ప్రజాజ్యోతి. రబీ 2026–27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేని నేపథ్యంలో వరి సాగును నివారించి, ఉద్యాన పంటలు, పండ్లు, కూరగాయలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు, సూక్ష్మ సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యా శాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, VBGRAMG పనుల పురోగతిపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సమీక్షించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, పంటల వైవిధ్యీకరణ, ఖరీఫ్ పంటల ఉత్పాదకత పెంపు, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రైవేటు మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధంగా ఉంచి, రైతుల వివరాల నమోదు

మిగతా 2 లో...

అభివృద్ధి పనులకు ఎంపీ వంశీకృష్ణ భూమి పూజలు



అజయ్ పాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ వంశీకృష్ణకు ఘన స్వాగతం

ధర్మారం (ప్రజా జ్యోతి న్యూస్): ధర్మారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ భూమి పూజలు నిర్వహించారు.ధర్మారం గ్రామంలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు, ఎర్రగుంటపల్లి గ్రామంలోని దుర్గామాత ఆలయం వద్ద ఎంపీ నిధులతో నిర్మించనున్న రీడింగ్ రూమ్ పనులకు భూమి పూజ చేశారు. అలాగే నర్సింగాపూర్ గ్రామంలో ఎంపీ నిధులతో సుమారు రూ.12 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, బోర్‌వెల్ పనులకు శంకుస్థాపన చేశారు.మొదటగా నర్సింగాపూర్ గ్రామంలోని పురాతన శివాలయాన్ని ఎంపీ వంశీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ బద్దం గంగారెడ్డి తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.నర్సింగాపూర్ చౌరస్తాలోని ఛత్రపతి శివాజీ విగ్రహం అభివృద్ధికి సహకారం అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.పత్తిపాక గ్రామంలోని యువశక్తి యూత్ కార్యాలయాన్ని ఎంపీ సందర్శించారు. యూత్ వ్యవస్థాపకుడు రేషవేణి మహేష్‌ను కలిసి యువశక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో యువశక్తి యూత్ సభ్యులు సాధిస్తున్న పురోగతిని అభినందించారు. గ్రామంలో లైబ్రరీ, ఓపెన్ జిమ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని

మిగతా 2 లో...

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల

- రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రూ.3.50 కోట్ల రహదారిపై గ్రామస్థులతో కలిసి బైక్ ప్రయాణం
- ఈ నెల 29న అలుగునూర్‌లో దీక్షా దివస్ సభ.. హాజరుకానున్న కేటీఆర్



2 లో...

డ్రగ్స్ రహిత పెద్దపల్లి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం సమాజ బాధ్యత
- తల్లిదండ్రులు పిల్లల కదలికలు, స్నేహాలపై నిఘా పెట్టాలి: సీపీ అంబర్ కిషోర్ ఝా



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 13 ప్రజా జ్యోతి: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం పోలీసుల ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, విద్యా సంస్థలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తును మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు సమష్టికృషి అవసరమని స్పష్టం చేశారు. నిషా ముక్త్ భారత్, ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్స్‌లో

మిగతా 2 లో...

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా – ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

(మొదటి పేజీ తరువాయి...)



అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, పట్టణ వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు, నామినీ వివరాలు సేకరించాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు మాట్లాడుతూ, దరఖాస్తుల సేకరణ, ఆధార్ వివరాల నమోదు, నామినీల వివరాల ధ్రువీకరణతో పాటు మొత్తం ప్రక్రియను డిజిటలైజేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఐడీఓసీ నుంచి పాల్గొన్నారు. సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

అభివృద్ధి పనులకు ఎంపీ వంశీ కృష్ణ భూమి పూజలు



(మొదటి పేజీ తరువాయి...)

యూత్ సభ్యులు కోరగా, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, అంచనాలు తయారుచేసి పంపించాలని ఎంపీ సూచించారు.ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణను మాజీ ఎంపీటీసీ బద్దం అజయ్ పాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాడె సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ బద్దం అజయ్ పాల్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బద్దం లింగారెడ్డి, బద్దం సుధాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ బద్దం సత్యనారాయణ రెడ్డి,వార్డు సభ్యులు గుండేటి రాజేశం, చల్ల గంగారెడ్డి, చల్ల రమేష్, పుట్ట శంకర్, మెర్జ సతీష్, కాంపల్లి అజయ్, తొర్రి రేణుక, గోదుగు ఎల్లయ్య, నర్సింగాపూర్,పత్తిపాక గ్రామ శాఖ అధ్యక్షులు అరుకంతం స్వామిరెడ్డి, బైరి వెంకన్న, పార్టీ సీనియర్ నాయకులు బద్దం నరసింహారెడ్డి, కోయడ రవీందర్ గౌడ్,నాయకులు స్వర్గం భూమేష్,బొజ్జ మహిపాల్, బద్దం మహేందర్ రెడ్డి, అన్నడి నాగేందర్ రెడ్డి, కనకట్ల సత్తయ్య, అన్నడి నర్సింహారెడ్డి,గుండేటి రమేష్,బద్దం తిరుపతి రెడ్డి, కోల శ్రీనివాస్,సిరికొండ మహేందర్, బత్తిని కంకయ్య, శివాజీ యూత్ సభ్యులు, యువశక్తి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రబీ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై
రైతులకు అవగాహన కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి...)



ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి

పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరును ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు కనీసం 90 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను వినియోగించుకోవాలని తెలిపారు.

పాఠశాలల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

రూసా 2.0,పీఎం ఉషా పథకాల కింద మంజూరైన 41 పనుల్లో 8 పూర్తయ్యాయని, మిగిలిన 33 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు.

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు ప్రాధాన్యత

ప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచామని, అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

గ్రామాలు,పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సూచించారు. బస్టాండ్లు,రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత

VBGRAMG పథకం కింద నీటి సంరక్షణ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని, గ్రామాల్లో కాలువలను శుభ్రం చేసి అవసరమైన పనులను పూర్తి చేయాలని సీఎస్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, యెల్లంపల్లి కాలువల నెట్‌వర్క్ స్టేజ్ –2లో ప్యాకేజీ 1, 2, 3లతో పాటు కాళికోట సూరమ్మ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశామని, ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని సీఎస్‌కు వివరించారు.

పెండింగ్ సాగునీటి పనులు త్వరగా పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించి, అవసరమైన సమన్వయంతో పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, రెవెన్యూ డివిజనల్ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత పెద్దపల్లి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

(మొదటి పేజీ తరువాయి...)

పెద్దపల్లి జోన్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్నవారు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు వస్తే పెద్దపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందన్నారు. మహారాష్ట్ర ప్రాంతం నుంచి కొందరు వ్యక్తులు పెద్దపల్లి రైల్వే స్టేషన్ ద్వారా వచ్చి యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల వినియోగం వైపు ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో స్నేహం చేస్తున్నారు, వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు వస్తున్నాయా అనే విషయాలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. పిల్లలు కోపగించుకున్నా సరే, వారి భవిష్యత్తు కోసం ప్రశ్నించాలని, ప్రేమతో కూడిన పర్యవేక్షణ అవసరమని అన్నారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ప్రహరీ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై నిరంతరం అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థుల ప్రవర్తనను పర్యవేక్షిస్తామన్నారు. ఇప్పటికే మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను నేరస్థులుగా చూడకుండా, వ్యసనం నుంచి బయటపడేలా సహకరించాలని సూచించారు. సింగరేణి మెడికల్ కాలేజీలో అందుబాటులో ఉన్న డీ-అడిక్షన్ కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నారని వివరించారు. వ్యసనాలకు దూరమై సాధారణ జీవితంలోకి రావాలనుకునే వారికి పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అయితే మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలు, వినియోగాన్ని ప్రోత్సహించడం, అక్రమ కార్యకలాపాల్లో భాగస్వాములు కావడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా పోలీస్ శాఖ చేస్తున్న ప్రయత్నాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి, ఏసీపీ జి. కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, ఎస్ఐలు రాజశేఖర్, మధుకర్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్ రూరల్,నవంబర్ 13,(ప్రజాజ్యోతి): మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శుక్రవారం నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.మండలంలోని చామన్‌పల్లి,చర్లబూత్కూర్,మొగ్దుమ్ పూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల సమస్యలపై ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు.అనంతరం రూ.3.50 కోట్లతో నిర్మించిన రహదారిపై గ్రామస్థులతో కలిసి బైక్ నడిపారు. ఈ నెల 29న అలుగునూర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ సభ ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి...

కరీంనగర్ రూరల్ మండలంలోని చామన్‌పల్లి, చర్లబూత్కూర్, మొగ్దంపూర్ గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గంగుల కమలాకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం రైస్ మిల్లర్లు నేరుగా గ్రామాలకు వచ్చి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక తగ్గుతోందన్నారు.బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ ధాన్యానికి రూ.3,100 వరకు ధర లభిస్తుంటే..



ప్రభుత్వ కొనుగోలు ధర రూ.2,900 మాత్రమే ఉండటంతో రైతులు ప్రభుత్వ కేంద్రాలకు ఎందుకు వస్తారని ప్రశ్నించారు.బహిరంగ మార్కెట్ ధరకు సమానంగా ప్రభుత్వం చెల్లిస్తే రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకొస్తారని పేర్కొన్నారు.హమాలీ ఖర్చులు, తాలు, తరుగు పేరుతో రైతులపై అదనపు భారం పడకుండా చూడాలని,మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. ఈసారి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు కేవలం 25 నుంచి 30 శాతం ధాన్యం మాత్రమే వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.రాష్ట్రంలో పండిన ధాన్యం రాష్ట్ర అవసరాలకే ఉపయోగపడేలా పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

రూ.3.50 కోట్ల రహదారిపై బైక్ నడిపిన ఎమ్మెల్యే..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గంగుల కమలాకర్ మంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక చొరవతో చర్లబూత్కూర్ నుంచి ప్రశాంత్‌నగర్ మీదుగా దుబ్బపల్లి వరకు రూ.3.50కోట్లతో నిర్మించిన రహదారి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.రహదారి నిర్మాణం పూర్తికావడంతో తమ ప్రయాణ కష్టాలు తీరాయని స్థానిక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలకు వెళ్తున్న గంగుల కమలాకర్‌కు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నూతన రహదారిపై గ్రామస్థులతో కలిసి ఆయన స్వయంగా బైక్ నడిపారు. రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించినందుకు కృతజ్ఞతగా కాలనీవాసులు ఆయనను సత్కరించారు.జై తెలంగాణ.. జై జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు.

అలుగునూరులో దీక్షా దివస్ సభకు సన్నాహాలు..

ఈ నెల 29న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అలుగునూర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై గంగుల కమలాకర్ ప్రత్యేక దృష్టి సారించారు.సభ నిర్వహించనున్న ప్రాంగణాన్ని పార్టీ ముఖ్య నాయకులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో సభా ప్రాంగణం,వేదిక,వాహనాల పార్కింగ్,నాయకులు,కార్యకర్తలు,ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించారు.ఈ పరిశీలనలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణరావు,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు,నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్,మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్,మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి,పీఏ సీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాం సుందర్ రెడ్డి,తదితర నాయకులు పాల్గొన్నారు.

యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ





సుల్తానాబాద్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డులో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్నభవన నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా భవన నిర్మాణానికి అదనంగా మరో రూ.15 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణారావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఏడో వార్డు యాదవ సోదరులకు ఇచ్చిన మాట ప్రకారం కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. యాదవ సంఘం సభ్యులు, స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. భవన నిర్మాణానికి ప్రస్తుత నిధులతో పాటు అదనంగా మరో రూ.15 లక్షలు మంజూరు చేసి అవసరమైన సదుపాయాలు కల్పిస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు కేటాయించడంపై యాదవ సంఘం నాయకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, ఏడో వార్డు కౌన్సిలర్ వరప్రదీప్, కౌన్సిలర్లు బాకం సాయికిరణ్ యాదవ్, గాజుల రాజమల్లు, గాదాసు మంజుల, రవీందర్, తొర్రికొండ ప్రభాకర్ చింతల రాజు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్,ప్రజాప్రతినిధులు, యాదవ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి వివాహ ఆర్థిక సహాయం

- సర్పంచ్ కొండ రమేష్ గౌడ్



ఎల్లారెడ్డిపేట నెంబర్ 13ప్రజా జ్యోతి పుల్లారెడ్డిపేట మండలంగొల్లపల్లి గ్రామానికి చెందిన మారెపు మమత – భూషణ్ కర్ కుటుంబానికి చెందిన వైష్ణవి వివాహం సందర్భంగా పేద కుటుంబానికి అండగా నిలుస్తూ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ ₹5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో తీగల ప్రకాష్, గోగూరి శ్రీనివాస్ రెడ్డి, పొన్నాల వెంకటేష్ రెడ్డి, కొండ సాయి, కొండ నరసింహులు, దాసరపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి

- నేరుగా పంచాయతీ ఖాతాల్లోకే సొంత ఆదాయం జీవో 43 జారీ



ఎల్లారెడ్డిపేట నవంబర్ 13ప్రజా జ్యోతి ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలోసర్పంచ్ ల పక్షాన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 43 పట్ల ఎల్లారెడ్డిపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, నారాయణపూర్ గ్రామ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జీవో 43 గూర్చి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల ఆర్థిక నిర్వహణలో కీలక మార్పు చోటుచేసుకుందనీ, గ్రామ పంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకునే ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ఖజానా (ట్రెజరీ)లో జమ చేయకుండా నేరుగా ఆయా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం అవకాశం కల్పించిందనీ అన్నారు.ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం–2026ను అమల్లోకి తీసుకొస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో ఎంఎస్ నెం.43ను జారీ చేసి,ఈ నూతన విధానం అక్టోబరు 9, 2026 నుండే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొందనీ అన్నారు.

రూ.9 లక్షలతో బావుసాయిపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

- గ్రామ ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత

కొనరావుపేట, నవంబర్. 13(ప్రజాజ్యోతి)కొనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రూ.9 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో సీఆర్ఆర్ నిధుల ద్వారా మంజూరైన ఈ పనులను సర్పంచ్ పేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా ప్రారంభించారు.గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యవంతంగా ఉండటంతో పాటు, వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు తొలగనున్నాయని .గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మారుపాక సునీత, దువ్వల అక్షయ్, ఆరే సుజాత, ఊరడి రమేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి రాధికతో పాటు నేరెళ్ల దేవయ్య, బొడ్డు దేవయ్య, జంగం సంజీవ్, దినాకర్, లచ్చయ్య పాల్గొన్నారు.



తెలంగాణ తొలి పాద్దు.. అన్యాయంపై ధిక్కార స్వరం కాళోజీ

- ప్రజాకవికి ఘన నివాళులు



వేములవాడ,నవంబర్,13:ప్రజాజ్యోతి. తెలంగాణ ప్రజల ఉద్యమాలకు తన కలంతో దిశానిర్దేశం చేసిన ప్రజాకవికాళోజీనారాయణరావు24వవర్ధంతిని పురస్కరించుకుని వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆయనచిత్రపటానికిపూలమాలలువేసిఘనంగానివాళులర్పించారు.ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అన్యాయాన్ని ఎదిరించడమే తన జీవిత లక్ష్యంగా భావించిన కాళోజీ, నిజాం నిరంకుశ పాలనకు,రజాకార్లఅరాచకాలకువ్యతిరేకంగా తనకలంతో పోరాడిన గొప్ప ప్రజాకవి అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమంలో ఆయన గొంతు ప్రతిధ్వనించిందని పేర్కొన్నారు.'పుట్టుక నీది.. చావు నీది..బతుకంతా దేశానిది' అనే సందేశంతో ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన కాళోజీ రచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. ఆయన రచించిన 'నా గొడవ'తో పాటు అనేక కవితలు సామాజిక చైతన్యానికి ప్రతీకలుగా నిలిచాయని తెలిపారు. కాళోజీ సేవలకు గుర్తింపుగా పద్మవిభూషణ్ పురస్కారం లభించిందని, ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 9ను తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కొంపెల్లి శ్రీ గీతా జన్మదిన వేడుకలు



తిమ్మాపూర్, నవంబర్ 13 (ప్రజాజ్యోతి):–కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్‌లో గల తనుశ్రీ ఇన్ఫ్రా డెవలపర్స్ రియల్ ఎస్టేట్ ఆఫిస్ లో సిఎండి ఎలుక సంతోష్ ఆధ్వర్యంలో కొంపెల్లి శాంతికుమార్ కవిత దంపతుల పెద్ద కూతురు కొంపెల్లి శ్రీ గీత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.చిన్న కూతురు కొంపల్లి తన్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి స్వీట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ దూల జ్యోతి,నరేష్,సంపత్, అంజయ్య,శ్రీనివాస్,పద్మ,తదితరులు పాల్గొన్నారు.

అంతరరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ఎల్లారెడ్డిపేట ఏటీఎం చోరీ కేసులో



ఎల్లారెడ్డిపేట నవంబర్13(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో జరిగిన ఏటీఎం చోరీ కేసులో అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు అరెస్టు చేసి రిమాండ్ పంపారు రాజస్థాన్ కు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసిన పోలీసులు సిరిసిల్ల డిఎస్పీ కార్యాలయంలో అరెస్టు చూపుతున్న డిఎస్పి నాగేంద్ర చారి. సీఐ వెంకటేష్ ఎస్సై రమేష్ పోలీసులు ఉన్నారు.

వ్యవసాయ బావిలో పడి మూడేళ్ల చిన్నారి మృతి

- నీటిలో తేలియాడిన అమ్ములు మృతదేహం.. విషాదంలో కుటుంబ సభ్యులు



ముస్తాబాద్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి):రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిన్నటి నుంచి కనిపించకుండా పోయిన మూడేళ్ల చిన్నారి అమ్ములు వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. చిన్నారి మృతదేహం బావిలో నీటిపై తేలియాడుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీరుమున్నీర య్యారు. విష రాల్లోకి వెళితే.. ముస్తాబాద్‌లోని నవజ్యోతి పాఠశాల సమీపంలో గుడిసెలో నివాసం ఉంటున్న కుటుంబానికి చెందిన అమ్ములు (3) గురువారం ఉదయం 8 నుంచి 9గంటలమధ్య ఆడుకుంటూ బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చిన్నారి కోసం పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. చిన్నారి ఆచూకీ కోసం స్థానికుల సహకారంతో వెతుకుతుండగా సమీపంలోని వ్యవసాయ బావిలో చిన్నారి మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. వెంటనే చిన్నారిని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటివరకు అల్లారుముద్దుగా ఆడుకుంటూ కనిపించిన చిన్నారి విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో ముస్తాబాద్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

రీ-సర్వే విజయవంతానికి రైతులు సహకరించాలి

- రైతులకు అవగాహన కల్పించాలి.. సర్వే బృందాలకు సహకరిస్తాం: సర్పంచుల హామీ



ముస్తాబాద్: నవంబర్ 13(ప్రజా జ్యోతి):మండలంలోని మొర్రాపూర్, గూడూరు గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ–సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు శుక్రవారం ముస్తాబాద్ రైతు వేదికలో రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రీ–సర్వే జరుగుతున్న మొర్రాపూర్, గూడూరు గ్రామాల సర్పంచులు, ఎంపీడీవో, డీఐఓ సర్వేయర్, వ్యవసాయ అధికారి (ఏఓ), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లు, రీ–సర్వే బృందం సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ.. భూ రీ–సర్వే ద్వారా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులందరికీ ముందస్తుగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను సర్వే బృందాలకు అందించి, సర్వే సమయంలో పూర్తి సహకారం అందించాలని కోరారు.గ్రామస్థాయిలో రైతులకు రీ–సర్వే ప్రాధాన్యతను వివరించి, ఎలాంటి అపోహలు లేకుండా అవగాహన కల్పిస్తామని మొర్రాపూర్, గూడూరు గ్రామాల సర్పంచులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రీ–సర్వే బృందాలకు గ్రామాల తరఫున అవసరమైన సహకారం అందించి, కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.భూ రికార్డుల ఖచ్చితత్వం, భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రీ–సర్వే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

నూతన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్‌కు ఘన సన్మానం



సుల్తానాబాద్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి) సుల్తానాబాద్ పట్టణ ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లె శ్రీనివాస్‌ను శుక్రవారం ఏడో వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్, ఆరో వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పల్లె శ్రీనివాస్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ . అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పల్లె శ్రీనివాస్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవలందించాలని వారు ఆకాంక్షించారు.

పోలీస్ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

సుల్తానాబాద్, నవంబర్ 13(ప్రజా జ్యోతి) పెద్దపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అంబాల రాజేందర్ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శుక్రవారం సుల్తానాబాద్ పోలీస్ అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్‌తో పాటు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తిప్పారపు అనిల్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కనకం శంకర్ తదితరులు సీఐ రంజిత్ రావు, ఎస్ఐ చంద్రకుమార్‌లను కలిసి మర్యాదపూర్వకంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో ఇరుగురాళ్ల మాణిక్, రామకృష్ణ, మోహన్, మహేందర్, దేవేందర్‌తో పాటు పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.



భారత్ సమిట్‌పై బీజేపీ నేతల వ్యాఖ్యలు బాధ్యతారాహితం

- తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బతీసేలా విమర్శలు చేయడం సరికాదు
- డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్



కొత్తపల్లి నవంబర్ 13, (ప్రజా జ్యోతి) కరీంనగర్:భారత్ సమిట్‌పై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నానని కరీంనగర్ డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్ పేర్కొన్నారు. భారత్ సమిట్‌ను దేశ వ్యతిరేక శక్తుల కోసమే నిర్వహిస్తున్నారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యానించడం, అలాగే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి “భారత్ సమిట్ కాదు. దేశ వ్యతిరేక సమిట్” అంటూ విమర్శలు చేయడం వారి రాజకీయ సంకుచిత వైఖరికి నిదర్శనమని అయన విమర్శించారు.తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, ప్రపంచ దేశాల ప్రతినిధులు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు ఒకే వేదికపై చర్చించేందుకు భారత్ సమిట్ దోహదపడుతుందని తెలిపారు. ఇలాంటి అంతర్జాతీయ వేదికను స్వాగతించాల్సింది పోయి, రాజకీయ కక్షతో దేశ వ్యతిరేక కార్యక్రమంగా చిత్రీకరించడం బాధ్యతాయుతమైన నాయకుల లక్షణం కాదన్నారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, అంతర్జాతీయ పెట్టుబడులు, తెలంగాణ ఖ్యాతిని పెంపొందించే కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై నిర్మాణాత్మక సూచనలు చేయకుండా అనవసర ఆరోపణలు చేయడం ద్వారా బీజేపీ నేతలు తమ రాజకీయ ఆలోచనా విధానాన్ని బయటపెట్టుకుంటున్నారని అన్నారు.తెలంగాణ అభివృద్ధిని, రాష్ట్ర గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

బాలలే రేపటి సమాజ నిర్మాతలు

- చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ
- ఐపీఎస్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు
- ఆటపాటలతో అలరించిన చిన్నారులు



సుల్తానాబాద్, నవంబర్ 13: (ప్రజా జ్యోతి) బాలలే రేపటి సమాజ నిర్మాతలని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ అన్నారు. పట్టణంలోని స్వప్న కాలనీలో గల ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటలు, రంగవల్లులతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా చైర్మన్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ.. బాలలే దేశానికి విలువైన సంపద అని, నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ, సృజనాత్మకత దాగి ఉంటాయని, వాటిని గుర్తించి ప్రోత్సహించినప్పుడే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, వివిధ కార్యక్రమాలతో సందడి చేశారు. రంగురంగుల రంగవల్లులు వేస్తూ తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారుల కేరింతలు, ఉత్సాహంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థుల ఆనందోత్సాహాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించిన ఇల్లందకుంట పోలీసులు

- సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను గుర్తించిన పోలీసులు



ఇల్లందకుంట, నవంబర్ 13 (ప్రజాజ్యోతి) :పోగొట్టుకున్నమొబైల్ ఫోన్‌ను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించిబాధితుడికి తిరిగి అందజేసినట్లు ఇల్లందకుంట పోలీసులు తెలిపారు. ఇల్లంద కుంట మండలం బూజునూరు గ్రామానికి చెందిన చీపాటి శ్రీకాంత్ ఈ నెల 13-10-2026న తన రెడ్‌మీ 9మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు.దీంతో ఆయన ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను గుర్తించే ప్రయత్నం చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఫోన్‌ను గుర్తించి, నవంబర్ 13న యజమాని చీపాటి శ్రీకాంత్‌కు తిరిగి అప్పగించారు.పోలీసుల సూచన: ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే ఆందోళన చెందకుండా వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

స్వచ్ఛ గ్రామమే లక్ష్యం.. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- సర్పంచ్ పోచంపల్లి చిన్నయ్య

సుల్తానాబాద్, నవంబర్ 13:(ప్రజా జ్యోతి) గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భూపతిపూర్ గ్రామ సర్పంచ్ పోచంపల్లి చిన్నయ్య అన్నారు. స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్లు, పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామాన్ని అన్ని విధాలుగా పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రతి ఇంటి నుంచి వెలువడే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన గ్రామాన్ని నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కార్తిక్, పంచాయతీ కార్యదర్శి ఆసియా బేగం, వార్డు సభ్యులు కనకం శంకర్, దొమ్మటి లావణ్య, ఐలయ్య, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాక్ లను సింగరేణికే ఇవ్వాలి

- ప్రైవేటు వారు దక్కించుకుంటే బొగ్గు తవ్వకాలను అడ్డుకుంటాం
- ఏఐటియుసి అధ్యక్షులు సీతారామయ్య



గోదావరిఖని, నవంబర్ 13 (ప్రజాజ్యోతి): తెలంగాణలో ఉన్న బొగ్గు గనుల ను సింగరేణి కే కేటాయించాలని,టెండర్ ప్రక్రియద్వారా ప్రైవేటు వారు దక్కించుకుంటె బొగ్గు ఉత్పత్తి ని అడ్డుకుంటామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య,ప్రధాన కార్యదర్శి కొరిమిరాజ్ కుమార్ హెచ్చరించారు.శుక్రవారం భూపాలపల్లిలో జరిగిన కేంద్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన వారు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాక్ లను సింగరేణికే కేటాయించాలని,వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే సింగరేణి మనుగడకే ప్రమాదమని,ప్రైవేటు వారు బ్లాక్ లను దక్కించుకుంటే బొగ్గు తవ్వకాలను అడ్డుకుంటామని వారు స్పష్టం చేశారు.సమ్మెనోటీసులో ఒప్పుకున్న డిమాండ్ మేరకు నెల రోజుల్లో పెండింగ్ లో ఉన్న డిపెండెంట్ లకు నియామక పత్రాలు ఇస్తామన్న యాజమాన్యం ప్రభుత్వం పేరుతో కాలయాపన చేస్తుందని ఆరోపించారు.ప్రభుత్వంతో సంబంధం లేకుండా 149 మంది పెండింగ్ డిపెండెంట్ లకు వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని,రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మారుపేర్లుడిపెండెంట్ లకు నియామక పత్రాలు ఇవ్వడం లేదని వారు విమర్శించారు.మెడికల్ బోర్డును ఆపవద్దని, దరఖాస్తు చేసుకున్న వారందరినీ అన్ ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు.కొన్ని కార్మిక సంఘాలు కోర్టుకు పోవడం వల్ల స్ట్రక్చర్ సమావేశాలు జరగడం లేదని,దీంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్ లో ఉంటున్నాయని వారు వాపోయారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17,18,19 తేదీల్లో నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు వారు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనేస్పందించిసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని,అవసరమైతే సమ్మె కు వెళ్తామని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి,ఉప ప్రధాన కార్యదర్శులు కే.సారయ్య, వై.వి.రావు,మడ్డి ఎల్లా గౌడ్,కే.వీరభద్రం, ముస్కె సమ్మయ్య,అన్ని బ్రాంచీల కేంద్ర కార్యవర్గ సభ్యులు,బ్రాంచి కార్యదర్శులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో పైప్‌లైన్ మరమ్మతులు

- రంగంలోకి దిగి బాగు చేసిన 33వ వార్డు వాసులు



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) సిరిసిల్ల పట్టణంలోని 33వ వార్డులో కాలనీవాసులు తమ సొంత ఖర్చులతో పాడైపోయిన తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తిరిగి నీటి సరఫరాను పునరుద్ధరించుకున్నారు. గతంలో కాలనీలోని బోరు మోటార్ ద్వారా పైప్‌లైన్ సహాయంతో ఇళ్లకు నీటి సరఫరా జరిగేది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ఈ పైప్‌లైన్ ద్వారా అందించే నీరు కాలనీవాసులకు ఎంతగానో ఉపయోగపడేది. అయితే కొంతకాలంగా పైప్‌లైన్ పలు చోట్ల పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యను పరిష్కరించి తిరిగి నీటి సరఫరా ప్రారంభించాలని స్థానిక కౌన్సిలర్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు కోరినా స్పందన లేకపోవడంతో చివరకు వారే స్వయంగా రంగంలోకి దిగారు. తమ సొంత డబ్బులతో మరమ్మతు పనులు చేపట్టి, పారలతో తవ్వకాలు జరిపి పాడైన పైప్‌లైన్‌ను బాగు చేసుకున్నారు. దీంతో నిలిచిపోయిన నీటి సరఫరా తిరిగి ప్రారంభమైంది. ప్రజల కనీస అవసరమైన తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో ప్రజలే సొంత ఖర్చులతో పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు కాలనీలోని నీటి సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కరీంనగర్‌లో ఘనంగా 'అరోమా స్వీట్స్ & బేకరీ' ప్రారంభోత్సవం



కరీంనగర్ టౌన్ నవంబర్ 13(ప్రజా జ్యోతి) కోర్టు సమీపంలోని పెంచాల కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'అరోమా స్వీట్స్ బేకరీ' ప్రారంభోత్సవ వేడుక శుక్రవారం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా ప్రారంభించారు. అనంతరం నగర ప్రముఖులు, స్థానిక కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులతో కలసి మాజీ మంత్రి ఏఎల్ఏ గంగుల కమలాకర్, హుజురాబాద్ శాసనసభ్యులు పాడికౌశిక్ అతిథులుగా హాజరై బేకరీని ప్రారంభించారు. ఈ వేడుకకు జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్, ఫైమా, శ్రీ విద్య ప్రత్యేక ఆకర్షణగా నీలిచారు . ఈ సందర్భంగా బేకరీ యాజమాన్యం మాట్లాడుతూ, స్వచ్ఛత నాణ్యత,సంప్రదాయ ఆధునిక స్వీట్లు,బేకరీ ఐటమ్స్,కేకులు, హాట్ స్నాక్స్,తయారీతో పాటు, సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే సరసమైన ధరలు మా యొక్క ప్రత్యేకత అని తెలిపారు.యాజమాన్య సభ్యులు గొట్టిముక్కుల రవీందర్, అరుణ్ కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి హైస్కూల్ లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

గోదావరిఖని, నవంబర్ 13 (ప్రజాజ్యోతి) : గోదావరిఖనిలో సింగరేణి కాలరీస్ హైస్కూల్,సెక్టార్–2, బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ1 ఏరియా సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి.హనుమంతరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా హనుమంతరావు వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి,వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు,గీతాలాపనలు,ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇన్‌చార్జి హెడ్‌మిస్ట్రెస్ ఆర్. విక్టోరియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

- నాగ చతుర్థి పూజలు





వేములవాడ,నవంబర్,13:ప్రజాజ్యోతి. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. పవిత్ర కార్తీక మాసం ప్రారంభం కావడంతో పాటు శుక్రవారం కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. నాగచతుర్థి సందర్భంగా భక్తులు నాగదేవత లకు పూజలు చేశారు. ఆలయంలో నిర్వహించిన అభిషేకాలు, అన్న పూజలు,కుంకుమ పూజ,చండీహోమం,నిత్యకళ్యాణం,సత్యనారాయణ స్వామి వ్రతం, లింగార్చన తదితర ఆర్జిత సేవలలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొనిమొక్కులుతీర్చుకున్నారు.అలాగే గండదీపంలో నూనెపోసిమొక్కులుచెల్లించుకున్నారు. కార్తీక మాస విశిష్టతను పురస్కరించుకుని భక్తులు ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి, అర్చకులకు దీపదానం చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగదేవత విగ్రహాలకు భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి హారతులు సమర్పించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిరుపేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్లతో సాకారం

- మోటం శ్రీనివాస్ - లక్ష్మి దంపతుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ



వీణవంక, నవంబర్ 13 (ప్రజాజ్యోతి) ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.ఇందులో భాగంగా మోటం శ్రీనివాస్, లక్షి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల ప్రారంభానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య యాదవ్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మోటం శ్రీనివాస్ హాజరై భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.లబ్ధిదారుల కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషిచేస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.సొంతింటి కల నెరవేరుతున్న వేళ.. లబ్ధిదారుల కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

శ్రీకృష్ణవేణి ఆధ్వర్యంలో ఎల్‌నినో అవగాహన ర్యాలీ

చొప్పదండి, నవంబర్ 13 (ప్రజా జ్యోతి): చొప్పదండి పట్టణంలోని శ్రీ కృష్ణవేణి విద్యాలయం ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎల్‌నినో వల్ల వాతావరణంలో వచ్చే మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతం తగ్గడం, కరువు పరిస్థితులు, నీటి కొరత వంటి అంశాలపై విద్యార్థులు అవగాహన కల్పించారు. నినాదాలు, ప్లకార్డులతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ, వాతావరణ మార్పుల పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఈ ర్యాలీ ద్వారా సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అన్నిదానాల్లోకెల్లఅన్నదానం మిన్న



వేములవాడ,నవంబర్,13:ప్రజాజ్యోతి.మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పేదలకు అన్నార్తులకు 2044 రోజులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నేడు టీటీడీ ధర్మశాల, రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, దాతలు అందించే ప్రతి రూపాయి ప్రతి ఒక్కరి సహకారం ఆకలితో ఉన్న వారి కడుపు నింపడానికి ఉపయోగ పడుతోందని నేటి సమాజంలో ఎంతో మంది ఆకలితో అలమటిస్తున్న పరిస్థితుల్లో మనకు ఉన్నదానిలో కొంత భాగాన్ని అవసరంలో ఉన్న వారికి పంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మన పుట్టిన రోజులు వివాహ వార్షికోత్సవాలు పండుగలు పితృదేవతలస్మరణ వంటి శుభ సందర్భాలను పురస్కరించు కుని అన్నదాన కార్యక్రమం జరపడం ఎంతో పుణ్య మైనదని నేటి అన్నదాత లుగా కొలిపాక శ్రీవల్లి జ్ఞాపకార్థం వీరి కూతురు చిన్నారి వైష్ణవి అన్నదానం చేశారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి దాతలకు సేవలు అందిస్తు న్నసభ్యులకుహృదయపూర్వక కృతజ్ఞతలుతెలియజేస్తూన్నాం. ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుతూ మన మందరం చేయి చేయి కలుపుదాం ఆకలి లేని సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం అంతే కాకుండా ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం మానవత్వాన్ని చాటుదామని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్ పొలాస రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం.. వొడితల ప్రణవ్
- కాంగ్రెస్ ఇచ్చిన ఇంటికి రిబ్బన్ కట్ చేసిన కౌశిక్ రెడ్డి..
- లబ్ధిదారుల ఆనందాన్ని చూడాలి అంటూ ఆసక్తి కర వ్యాఖ్యలు



వీణవంక, నవంబర్ 13(ప్రజాజ్యోతి) పేదల సొంతింటి కలను సాకారం చేసి, లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గత పదేళ్లలో గత ప్రభుత్వం ఇళ్ల విషయంలో అర్హులైన పేదలకు అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.శుక్రవారం వీణవంక మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ఇంట్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులను అభినందించారు. గత 30సంవత్సరాలుగా సొంతింటికోసం ఎదురుచూశామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయడంతో తమ కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కొత్త ఇంట్లో గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించే కౌశిక్ రెడ్డి, ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటికిరిబ్బన్ కట్ చేయడం ఆసక్తికర మన్నారు. కనీసం ఆ ఇంటి గృహప్రవేశం సమయంలో లబ్ధిదారుల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందాన్ని అయినా కౌశిక్ రెడ్డి గమనించాలని వ్యాఖ్యానించారు. పదేళ్ల పాటు హుజురాబాద్ నియోజకవర్గంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కేటాయించకుండా కాలయాపన చేశారని విమర్శించారు.ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతతో పాటు రెండో విడతలోనూ మరింత మంది అర్హులకు ఇళ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని ప్రణవ్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మైనారిటీ నాయకులు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రీ-సర్వేకు రైతులు పూర్తి సహకారం అందించాలి

- రైతులకు అవగాహన కల్పించి, సర్వే బృందాలకు అండగా ఉంటాం: సర్వంచులు



ముస్తాబాద్: నవంబర్ 13(ప్రజా జ్యోతి):భూ రీ–సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఖచ్చితమైన భూ వివరాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిరిసిల్ల రెవెన్యూ డివిజనల్ అధికారి సూచించారు. శుక్రవారం ముస్తాబాద్ రైతు వేదికలో మొర్రాపూర్, గూడూరు గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ–సర్వే కార్యక్రమంపై సమన్వయ సమావేశం నిర్వహించారు.రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రీ–సర్వే చేపడుతున్న మొర్రాపూర్, గూడూరు గ్రామాల సర్పంచులు, ఎంపీడీవో, డీఐఓ సర్వేయర్, వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లు, రీ–సర్వే బృందం సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. భూ రీ–సర్వే ద్వారా క్షేత్రస్థాయిలో భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, భూ రికార్డుల్లో పారదర్శకతతో పాటు ఖచ్చితత్వాన్ని తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సర్వే ప్రక్రియలో రైతులకు తమ భూములకు సంబంధించిన వివరాలపై అవగాహన కల్పించాలని, ఎలాంటి అపోహలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రైతులు సర్వే బృందాలకు అవసరమైన సమాచారం అందిస్తూ, క్షేత్రస్థాయిలో పూర్తి సహకారం అందించాలని కోరారు.అనంతరం మొర్రాపూర్, గూడూరు గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామాల్లోని రైతులకు రీ–సర్వే ప్రాధాన్యతను వివరిస్తామని, ప్రతి రైతుకు సమాచారం చేరవేసి సర్వే బృందాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో అధికారులకు, రైతులకు మధ్య సమన్వయం కల్పించి రీ–సర్వే కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషిచేస్తామని తెలిపారు.భూ రీ–సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

రైతులకు అండగా ధాన్యం కొనుగోలు కేంద్రలు ప్రారంభం



కోనరావుపేట,నవంబర్. 13(ప్రజాజ్యోతి)కొనరావుపేట మండలంలోని కనగర్తి,పల్లిమక్త,రామన్నపేట,ధర్మారం కొలనూర్,గ్రామలలో కొనరావుపేట,కొలనూరు,ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ లు బొమ్మాన భాస్కర్ రావు చేపూరి గంగాధర్ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టాలని, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని తెలిపారు.రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వరలక్ష్మి,మండల అధ్యక్షులు మానుక సత్యం,సర్పంచులు జిన్నా అనూష,అప్పల నాగభూషణం,మిర్యాల్ కార్ బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఫిరోజ్ పాషా,ఎఎంసి వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు నాయిని ప్రభాకర్ రెడ్డి,వెంకన్న,అజీమ్, సింగిల్ విండో డైరెక్టర్లు చిద్రవేణి సరిత, ఉప్పుల గంగయ్య, వీరబోయిన తిరుపతి యాదవ్,నీరటి సంజీవ్, సుంకరి రెడ్డి,బాపూ రెడ్డి,గణేష్,కార్తీక్,,మహిపాల్,నాలుక సత్యం అమృత రావు,శ్రీనివాస్,ఉపసర్పంచులు వార్డు సభ్యులు రైతులు పాల్గొన్నారు.

రచ్చపల్లి బడిలో చిన్నారుల రంగుల హంగామా!

- విభిన్న వేషధారణలతో అలరించిన బుజ్జాయిలు



ధర్మారం,(ప్రజా జ్యోతి): ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో ముస్తాబై పాఠశాల ప్రాంగణాన్ని సందడిగా మార్చారు.ట్రాఫిక్ సిగ్నల్స్, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలు,సేవ్ గర్ల్ చైల్డ్ వంటి సామాజిక అంశాలను ప్రతిబింబించే వేషధారణలతో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు.రంగురంగుల దుస్తుల్లో చిన్నారులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సముద్రాల వంశీ మోహనాచార్యులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉత్సాహం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు, వేదికపై మాట్లాడే ధైర్యాన్ని పెంపొందించేందుకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సముద్రాల సంపత్, విద్యా వాలంటీర్లు లక్ష్మణ్, సౌమ్య, రవళి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు వడ్లు విక్రయించాలి

- దళారులను నమ్మి మోసపోవద్దు



ధర్మారం,నవంబర్13 (ప్రజా జ్యోతి): ధర్మారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ మాజీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, నంది మేడారం సింగిల్ విండో చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని హెచ్చరించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ధాన్యం కొనుగోలు సమయంలో నిబంధనలను పాటిస్తూ,రైతులకు పారదర్శకంగా సేవలందించాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యంలో తేమ శాతం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేస్తూ రైతులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి ప్రధాన కార్యదర్శి గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కార్యదర్శి కొత్త నరసింహులు, మాజీ ఎంపీపీ కొడారి హనుమయ్య,మాజీ నీటి సంఘం చైర్మన్ రెడపాక శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు,డైరెక్టర్లు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శిలాఫలకాలకే పరిమితమైన పెద్దపల్లి అభివృద్ధి!

- బైపాస్ రోడ్డు, రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎప్పుడు పూర్తి చేస్తారు?
- హామీలు సరే.. ప్రజలకు కనిపించే అభివృద్ధి ఏది? ఎమ్మెల్యేకు బీజేపీ నేత పల్లె సదానందం సూటి ప్రశ్న



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 13, ప్రజాజ్యోతి: పెద్దపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో ఆర్భాటపు ప్రచారం, శిలాఫలకాల ఆవిష్కరణలు తప్ప క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో మూడేళ్లు గడుస్తున్నా పెద్దపల్లి నియోజకవర్గంలో పూర్తయిన అభివృద్ధి పనులేవో ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల పేరుతో వందలాది శిలాఫలకాలు ఏర్పాటు చేస్తున్న పాలకులు, వాటిలో ఎన్ని పనులు పూర్తయ్యాయో చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. ఏళ్ల తరబడి పెద్దపల్లి ప్రజలు ఎదురు చూస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణం ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గతంలో పెద్ద కల్వాల నుంచి అప్పన్నపేట వరకు బైపాస్ రోడ్డు నిర్మిస్తామని హడావుడి చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారని, భూసేకరణ, రైతులకు నష్టపరిహారం వంటి కీలక అంశాలను పరిష్కరించకుండా పనులను మధ్యలోనే వదిలేశారని ఆరోపించారు. నుజల స్రవంతి పథకం పేరుతో కొంతమేర మట్టిపోసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. శిలాఫలకాలపై చూపిస్తున్న శ్రద్ధను పనుల పూర్తిపై కూడా చూపించాలని హితవు పలికారు. పెద్దపల్లి జూనియర్ కళాశాల అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో లేకుండా పోయాయని, పట్టణంలో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ సైతం నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురాలేకపోవడం ఏ రకమైన అభివృద్ధి అని ప్రశ్నించారు. ప్రధాన బజార్ రహదారి పనుల విషయంలో వ్యాపారులను బెదిరించడం, కొందరిపై దాడులు జరిగినట్లు ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. పండుగల సీజన్‌లో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అభివృద్ధి పేరుతో చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయడం సరికాదన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన పెద్దపల్లి పట్టణానికి ప్రత్యేక గుర్తింపుగా ఉన్న కమాన్ చౌరస్తా రూపురేఖలను రాత్రికిరాత్రే మార్చే ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చారిత్రక ఆనవాళ్లను కాపాడుతూ, స్థానికుల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్నప్పటికీ ఆ విషయాన్ని ప్రజలకు తెలియకుండా చేస్తున్నారని విమర్శించారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు అందాల్సి ఉండగా, ఆర్థికంగా స్థితిమంతులైన వారికి కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ మండలంలో అర్హులైన పేదలకు ఇప్పటివరకు ఇళ్లు అందకపోవడం బాధాకరమన్నారు. మరోవైపు, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఈ పనులు ముందుకు సాగలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా సమస్యకు పరిష్కారం చూపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బైపాస్ రోడ్డు, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రచార ఆర్భాటాలకు స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కారంపై పాలకులు దృష్టి సారించాలని పల్లె సదానందం సూచించారు. పెద్దపల్లి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే బీజేపీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని హెచ్చరించారు. పెండింగ్ అభివృద్ధి పనుల సాధన కోసం పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ బాలసాని శ్రీనివాస్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఛాతరాజు రమేష్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోర మనోహర్, నాయకులు జిట్టే రాజు, బండి కరుణాకర్, మంథని కృష్ణ, ముత్యాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం చేస్తాం

- లబ్ధిదారులకు పత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



తిమ్మాపూర్ నవంబర్ 13 (ప్రజాజ్యోతి) కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో తొలి విడతలో 643 ఇళ్లు మంజూరు చేయగా తాజాగా 172 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసుకోవాలని సూచించారు.ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 172 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఇందులో భాగంగానే అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ వారి సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు.గడువులోగా నిర్మాణాలు చేపట్టని పక్షంలో మంజూరును రద్దుచేసి ఇతర అర్హులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణ బిల్లుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిర్మాణ దశలను బట్టి ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ డీఈ శ్రీలత, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ మహేశ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పాక్స్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు తిరుపతిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, వివిధ గ్రామాల సర్పంచులు పొన్నాల సంపత్, గంకిడి లక్ష్మారెడ్డి, తుమ్మనపల్లి సంధ్య, గోదారి శోభారాణి, పెరుక రవీందర్, ఎన్. చంద్రారెడ్డి, బిల్ల సంతోష్, దుర్గం శ్రీనివాస్, ఎం. స్వరూప, ఎ. రాంకిషన్, పురం శ్వేత, గాండ్ల శ్రీనివాస్, మామిడి మమత, జినుక మారుతి, సూరం స్వప్న, గుంటి లావణ్య, గుజ్జుల శ్వేత, పార్టీ నాయకులు డి. సంపత్ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాసరావు, మామిడి అనిల్ కుమార్, బుధారపు శ్రీనివాస్,కొత్త తిరుపతిరెడ్డి, రావుల కృష్ణ గౌడ్, ఎల్క రాజు, మాచర్ల అంజయ్య,గుంటి మల్లేశం,చింతల తిరుపతిరెడ్డి,లక్ష్మణ్,మాచర్ల శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

కాల్వ మల్లేశం కుటుంబ సభ్యులను పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



తిమ్మాపూర్ నవంబర్ 13 (ప్రజాజ్యోతి): కరీంనగర్ జిల్లా అలుగునూరు 8వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ మల్లేశం తండ్రి ఇటీవల స్వర్గస్తులైన సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస తో కలిసి కాల్వ మల్లేశం కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి,మనోధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమం లో సింగిరెడ్డి స్వామి రెడ్డి , సల్ల మహేందర్, గట్టేపల్లి దీపక్, నిఖిల్, ప్రశాంత్, సంపత్, చంద్రమౌళి, అంజి యాదవ్, చందు, వేణు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం



వేములవాడ,నవంబర్,13:ప్రజాజ్యోతి వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా, నాలుగో రోజు వేడుకలను ఆలయ ఏఈఓ జయకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పవిత్ర కార్తీక మాస పర్వదినాల సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు, సేవాసమితి సభ్యులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ వేడుకల్లో ఆలయ పర్యవేక్షకులు రాధ, భాస్కర్ , అర్చకులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తున్న కౌన్సిలర్లకు యాదవ సంఘం సన్మానం



సుల్తానాబాద్, నవంబర్ 13 ప్రజాజ్యోతి: సుల్తానాబాద్ పట్టణంలోని ఏడో వార్డు యాదవ్ నగర్‌లో శుక్రవారం యాదవ సంఘం నాయకులు కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఏడో వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్, ఆరో వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్‌లకు శాలువాలు కప్పి సత్కరించారు. వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న కౌన్సిలర్ల సేవలను ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు అభినందించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ మరింత అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలు



రామగిరి, నవంబర్ 13 (ప్రజాజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేలా రామగిరి మండలంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఏపీఎం పద్మ ఆధ్వర్యంలో కామన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు ప్రారంభించారు. కల్వచర్ల, రత్నాపూర్, నవాబుపేట, లద్నాపూర్, రాజాపూర్, ముస్త్యాల, బేగంపేట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైతులకు అవసరమైన సదుపాయాల కల్పనలో ఐకేపీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. రైతులకు కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా చూడటంతో పాటు కేంద్రాల నిర్వహణ సజావుగా సాగేందుకు అధికారులు నిరంతరంగా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారద, రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ, నవాబుపేట సర్పంచ్ రొడ్డ మౌనిక, లద్నాపూర్ సర్పంచ్ వనం రామచందర్ రావు, రాజాపూర్ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి , ముస్త్యాల సర్పంచ్ సుంకరి మహేష్, బేగంపేట ఉపసర్పంచ్ సందెల రేణుకతో పాటు ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

బొమ్మనపల్లిలో ఘనంగా 'ఖేతి బచావో అభియాన్' అవగాహన సదస్సు

- పోషకాహారంతోనే కుటుంబ ఆరోగ్య పరిరక్షణ: కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి
- రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి: వ్యవసాయ అధికారి పున్నం చందర్ రెడ్డి



చిగురుమామిడి /నవంబర్ 13, ప్రజా జ్యోతి చిగురు మామిడిమండలంలోని బొమ్మనపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం గ్రామ సర్పంచ్ కొంకట మౌనిక అధ్యక్షతన 'ఖేతి బచావో అభియాన్' అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీకే ఫుడ్ సైన్స్ శాస్త్రవేత్త ప్రశాంతి మాట్లాడుతూ..మహిళలు పోషకాహారంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని, కుటుంబ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా స్వయం ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి రైతులకు నేల ఆరోగ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. పంటల సాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, భూసార పరీక్షల ఆధారంగా సమతుల ఎరువులు, సేంద్రియ మరియు జీవ ఎరువులను వినియోగించాలని కోరారు. అనంతరం రైతులకు పొద్దుతిరుగుడు విత్తనాలు, జీవన ఎరువులు, బ్రైకోడెర్మాను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాసర్ల హరీష్, ప్యాక్స్ డైరెక్టర్ కూతటి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు బడుకొలు దేవేందర్ రెడ్డి, ఏఈవోలు వి. అఖిల, సిహెచ్. రాకేష్, గ్రామ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న పిసిసి సభ్యులు, శైలేందర్ రెడ్డి

- లబ్ధిదారుల దంపతులకు శుభాకాంక్షలు.. శాలువాతో సత్కారం,



వెల్గటూర్, నవంబర్ 13 (ప్రజాజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం జగదేవ్‌పేటలో ఎలిగేటి సురేష్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పీసీసీ కార్యవర్గ సభ్యుడు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి హాజరై లబ్ధిదారుల దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శైలేందర్‌రెడ్డిని సురేష్ దంపతులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సల్ల తిరుపతి, డైరెక్టర్ హరీష్, మన్నెజితేందర్, లింగారెడ్డి, సురేష్, లచ్చిరెడ్డి, శ్రీహరి, రూపేష్‌తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎండపల్లి, నవంబర్ 13, ప్రజాజ్యోతి మండలంలోని 33 కేవీ గుల్లకోట, పాతగూడూర్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఈ నెల 14న (శనివారం) ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రాజారాంపల్లి సెక్షన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. గుల్లకోట వ్యవసాయ, ఎక్స్‌ప్రెస్ ఫీడర్ల పరిధితో పాటు చర్లపల్లి, కొండాపూర్, ఆత్మకూర్, పాతగూడూర్, రాజారాంపల్లి, సూరారం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన





రాయికల్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి) ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. శుక్రవారం రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో శాస్త్రవేత్తలు పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి మాగాణి భూముల్లో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేపట్టే విధానాలను వివరించారు. అనంతరం రైతు నల్లాల శేఖర్ సాగు చేస్తున్న బీర, కాకర పంటలను పరిశీలించారు. ఆయా పంటలకు ఆశించే వివిధ రకాల పురుగులు, తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. స్వాతి, రవి, రామకృష్ణ, రాజేష్, ఆలూరు సర్పంచ్ నల్లాల స్వామి, లక్ష్మీనారాయణ, మెక్కొండ రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణ నిర్మాణాల తొలగింపు

రాయికల్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి) రాయికల్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు, ఇటిక్యాల రోడ్డుకు ఎదురుగా ఉన్న ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని శుక్రవారం అధికారులు తొలగించారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదు మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ లీడర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు ఈ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా మున్సిపల్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు, సిబ్బంది సంయుక్తంగా పాల్గొని రోడ్డు ఆక్రమణను తొలగించారు. ప్రభుత్వ రహదారులు, ప్రజా స్థలాలను ఎవరూ ఆక్రమించరాదని, మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ రహదారులు, స్థలాలను ఆక్రమించే వారిపై తెలంగాణ మున్సిపాలిటీల చట్టం–2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్, తహసిల్దార్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు కీలకం

- విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించాలి
- మండల విద్యాధికారి మోహన్ రెడ్డి



బుగ్గారం నవంబర్ 13(ప్రజాజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంతో కీలకమైనవని మండల విద్యాధికారి మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన, ప్రశ్నావళి పోటీలు నిర్వహించారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడంతో పాటు విద్యార్థులకు ప్రశ్నావళి పోటీలు చేపట్టారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ పోటీల ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల వ్యవస్థపై అవగాహన పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ధర్మపురి నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో బుగ్గారం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీనిత్య ప్రథమ, వెల్గొండ పాఠశాలకు చెందిన నిధిత్య ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రశ్నావళి పోటీల్లో బుగ్గారం పాఠశాలకు చెందిన రిశ్వంత్ ప్రథమ, సిరికొండ పాఠశాలకు చెందిన పావని ద్వితీయ స్థానాలు పొందారు. ఈ కార్యక్రమంలో సమగ్ర విద్యా వనరుల కేంద్రం సమన్వయకర్త పురుషోత్తం, ఉపాధ్యాయులు కొమురయ్య, కృష్ణకుమారి, లచ్చయ్య, మనోహర్, శ్రీనివాస్, కిరణ్, చంద్రశేఖర్, ప్రవీణ్ తదితరులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.





ఆలయ నిర్మాణానికి భూమి పూజ

- మహాయజ్ఞంలో దాతలు భాగస్వాములు కావాలి
- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



చిగురుమామిడి /నవంబర్ 13, ప్రజా జ్యోతి: చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో ని గుట్టపై స్వయంభుగా వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి నూతన ఆలయ నిర్మాణ భూమి పూజ మహోత్సవాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొలిపాక వేణు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ వేడుకకు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.మొక్కిన మొక్కులను తీరుస్తూ కొంగుబంగారంగా నిలుస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి నూతన ఆలయ నిర్మాణం జరగనుండటంపై భక్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల నాటి కల త్వరలోనే సాకారం కాబోతుండటంతో రేకొండ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే, ఆలయ గౌరవ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డిలు మాట్లాడుతూ.. భగవంతుని ఆలయ నిర్మాణం అనేది ఒక మహా యజ్ఞమని, ప్రతి ఒక్కరి సహాయ సహకారాలతోనే ఇది విజయవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. ఈ పవిత్ర కార్యంలో భక్తులు, దాతలు తమ వంతు బాధ్యతగా ధన, వస్తు రూపేణా విరాళాలు అందించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు ఆలయ నిర్మాణం కోసం సహకరించిన దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను ఆలయ కమిటీ చైర్మన్ కొలిపాక వేణు, కమిటీ సభ్యులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో తహసీల్దార్ కనకయ్య, రేకొండ సర్పంచ్ అల్లెపు సంపత్, సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, శ్రీ పాంబండ పంచముఖ ఆంజనేయ పీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పూజ్య గురు హుమేష్ స్వామీజీ, మాజీ ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి, ఐరెడ్డి భాస్కర్ రెడ్డి, బిళ్ల జైపాల్ రెడ్డి, బిళ్ల ప్రభాకర్ రెడ్డి, చిగురుమామిడి సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్, ఉపసర్పంచ్ బిల్లా సంతోష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, న్యాయవాది దేవదాస్, చాడ శ్రీధర్ రెడ్డి, బడుకొలు దేవేందర్ రెడ్డి, సాంబారి బాబు, తెరాల సత్యనారాయణ, బోయిని అశోక్, పూదారి వేణు గౌడ్, ముద్రకొల రాజయ్య, పోటు మల్లారెడ్డి, తెరాల అమర్, గాదేపాక సునీల్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల ఆధ్యాత్మిక ప్రస్థానం

- 41వ వసంతంలోకి శ్రీ సాంబశివ దేవాలయం
- డిసెంబర్ 1న ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం
- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.. దాతలు సహకరించాలి
- ఆలయ అర్చకులు పారవెల్ల రమేష్ శర్మ



సుల్తానాబాద్, నవంబర్ 13 (ప్రజా జ్యోతి)

పట్టణంలోని శ్రీ సాంబశివ దేవాలయం నాలుగు దశాబ్దాల ఆధ్యాత్మిక ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని 41వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు పారవెల్ల రమేష్ శర్మ తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 1, 2026 మంగళవారం ఈ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పారవెల్ల రమేష్ శర్మ మాట్లాడుతూ.. శ్రీ సాంబశివ దేవాలయం నాలుగు దశాబ్దాలుగా భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేవాలయం 40 సంవత్సరాలు పూర్తి చేసుకుని 41వ సంవత్సరంలోకి ప్రవేశించడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.కార్తీక మాసంలో శివారాధనకు ఎంతో విశిష్టత ఉందని, ఈ పవిత్ర సందర్భంలో నిర్వహించే కార్యక్రమాల్లో పట్టణంతో పాటు పరిసర గ్రామాల భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా అన్నదానం మహోన్నతమైన సేవా కార్యక్రమమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ఎంతో పుణ్యప్రదమని పేర్కొన్నారు. దేవాలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి, ఇతర ధార్మిక కార్యక్రమాలకు భక్తులు, పట్టణ ప్రముఖులు, దాతలు ముందుకు వచ్చి తమవంతు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. భక్తుల భాగస్వామ్యం, దాతల సహకారంతో శ్రీ సాంబశివ దేవాలయ 41వ వార్షికోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు పారవెల్ల రమేష్ శర్మ కోరారు.

మెయింటెనెన్స్ సెక్షన్‌ను యథావిధిగా కొనసాగించాలి

- ఆర్జీ-3 టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి సాంబయ్య



రామగిరి, నవంబర్ 13 (ప్రజాజ్యోతి): ఓసీపీ–1 బేస్ వర్క్‌షాప్‌లో తొలగించిన మెయింటెనెన్స్ సెక్షన్‌ను తక్షణమే పునరుద్ధరించి, ఇతర విభాగాలకు బదిలీ చేసిన కార్మికులను తిరిగి అదే సెక్షన్‌లో నియమించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య ఆర్జీ–3 జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. సెక్షన్ తొలగింపుతో డంపర్లు, ఇతర భారీ యంత్రాల మరమ్మతులకు ఆటంకం కలుగుతోందని, మోకాళ్లు, నడుము నొప్పులతో బాధపడుతున్న కార్మికులు కఠినమైన పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికుల ఆరోగ్య పరిస్థితులు, యంత్రాల నిర్వహణ, బొగ్గు ఉత్పత్తి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెయింటెనెన్స్ సెక్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. దేవ శ్రీనివాస్, ఈసంపల్లి రమేష్, రమ్య రెడ్డి, షరీఫ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలకు పదును

- 21న మండలస్థాయి.. 28న జిల్లా స్థాయి పోటీలు



ఎండపల్లి, నవంబర్ 13,ప్రజా జ్యోతి విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రంపై ఆసక్తి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ టెస్ట్ చెకుముకి సంబరాల పోస్టర్‌ను గుల్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎండపల్లి మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పరీక్షల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ నెల 21న మండలస్థాయి, 28న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి ఎంపికైన జట్లకు డిసెంబర్ 11 నుంచి 13 వరకు మేడ్చల్ జిల్లా కండ్లకోయలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుల్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునీందర్, ఉపాధ్యాయులు శనిగరపు రవి, నరసింహచారి, శ్రీనివాస్‌రెడ్డి, గాలేటి శ్రీనివాస్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రథమ ర్యాంకర్‌కు రూ.10 వేల నగదు బహుమతి

- తాటిపల్లి సహర్షితకు చెక్కు అందజేసిన శ్రీరామ్ గ్రూప్ జగిత్యాల బ్రాంచ్

ఎండపల్లి, నవంబర్ 13, ప్రజా జ్యోతి మండలంలోని పాత గూడూరులోని ఉన్నత పాఠశాలలో శ్రీరామ్ గ్రూప్ జగిత్యాల బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ టెన్త్ క్లాస్' కార్యక్రమంలో మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన తాటిపల్లి సహర్షితకు రూ.10 వేల నగదు బహుమతి చెక్కును అందజేశారు.విద్యార్థులను విద్యాపరంగా ప్రోత్సహించడంలో భాగంగా ఈ పురస్కారాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా మార్గదర్శనం చేశారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంగల జగదీశ్వర్‌రెడ్డి, పాఠశాల, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, శ్రీరామ్ గ్రూప్ ఉద్యోగులు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సేల్స్ అధికారులు పాల్గొన్నారు.



కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా గుల్లకోట బడి!

- విద్యార్థుల క్రమశిక్షణ, విద్యా ప్రమాణాలపై డీఈఓ ప్రశంసలు





ఎండపల్లి, నవంబర్ 13, ప్రజా జ్యోతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మండలంలోని గుల్లకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి కృషి,విద్యార్థులు క్రమశిక్షణ, అభ్యసన సామర్థ్యాల్లో రాణిస్తున్నారని జిల్లా విద్యాధికారి కె. రాము అన్నారు. దాత సానా రామకృష్ణారెడ్డి విరాళంతో ఆధునికీకరించిన ఒకటో తరగతి గదిని వారు గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ఉపన్యాసాల్లోనూ ప్రతిభ చూపుతున్నారని, ప్రధానోపాధ్యాయుడు చందూరి రాజిరెడ్డి సమాజ సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తున్న తీరు అభినందనీయమన్నారు.జిల్లా మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం, ఎక్స్ఎల్ ల్యాబ్ ద్వారా వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్న ఈ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోందన్నారు. దాత రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ..తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, దీనికి సేవచేసే అవకాశం రావడం అదృష్టమన్నారు.సర్పంచి మల్లేష్‌గౌడ్ పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు.అనంతరం దాత రామకృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. పాఠశాల పరిశుభ్రత, పచ్చదనం నిర్వహణలో కృషి చేస్తున్న స్వీపర్ మహమ్మద్ రాజ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు మునీందర్, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి కొమురయ్య గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీస్ స్టేషన్ సందర్శన

- పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన
- ప్రిన్సిపాల్ కుడేల లిఖిత ఆధ్వర్యంలో రైజింగ్ హై స్కూల్ విద్యార్థులతో ప్రత్యేక పర్యటన







కోరుట్ల,నవంబర్ 13 ప్రజా జ్యోతి విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు సమాజంలోని వివిధ రంగాలు, ప్రభుత్వ శాఖల పనితీరు, ఉద్యోగాలపై ప్రాయోగిక అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కోరుట్లలోని రైజింగ్ హై స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక విద్యా పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజలకు అందించే సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర గురించి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ కార్యకలాపాలు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు,ప్రజల రక్షణకు తీసుకునే చర్యల గురించి అధికారులు విద్యార్థులకు వివరించారు.పాఠశాల ప్రిన్సిపాల్ కుడేల లిఖిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీసు వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన కలిగింది. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, బ్యాంక్ మేనేజర్లు, డాక్టర్లు తదితర ఉన్నత స్థాయి ఉద్యోగాలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంలోని వివిధ రంగాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా తమ జ్ఞానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివాజీ, శ్రీనివాస్, సంజీవ్, మమత, సౌజన్య, పోస్టుమాస్టర్ తదితరులు పాల్గొని విద్యార్థులకు తమ విధులు, బాధ్యతలు, అనుభవాలను వివరించారు.

కోరుట్లలో భూకబ్జాలను సహించేది లేదు

- 19వ వార్డులో నిరుపేద మహిళ ఇంటి కూల్చివేతపై ఎంఐఎం ఆగ్రహం
- ఈ ఘటనను అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకెళ్తాం
- ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. రఫీ



కోరుట్ల, నవంబర్ 13 ప్రజాజ్యోతి కోరుట్ల పట్టణంలో అమాయక పేదల భూములను కబ్జా చేసే వారిని ఇకపై సహించేది లేదని ఎంఐఎం పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ.రఫీ హెచ్చరించారు. 19వ వార్డులో నిరుపేద కుటుంబానికి చెందిన ఇంటిని మున్సిపల్ అధికారులు కూల్చివేసిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు.శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఘటనాస్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సుమారు 60 ఏళ్లుగా ఆ కుటుంబం అక్కడే నివసిస్తోందని, కోర్టులో కేసు నడుస్తుండగానే మున్సిపల్ అధికారులు ఇంటిని కూల్చివేయడం దారుణమని రఫీ ఆరోపించారు.ఈ ఘటనపై పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీకి వివరించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషిచేస్తామని తెలిపారు.బాధితులకు తిరిగి న్యాయం జరిగే వరకు ఎంఐఎం పార్టీ అండగా ఉండి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి అబ్దుల్ వాజిద్, సహాయ కార్యదర్శి మహమ్మద్ నిజాముద్దీన్, మహమ్మద్ సల్మాన్, మహమ్మద్ సమీర్, షేక్ హాజీ, షేక్ అక్బర్, మహబూబ్ ఖాన్, మహమ్మద్ లాయఖ్, హమీద్, సయ్యద్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఎస్సైగా నరేష్ కుమార్

- సూరంపేట రాబరీ కేసు ఛేదన.. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిభకు గుర్తింపు



కొడిమ్యాల, నవంబర్ 13, (ప్రజాజ్యోతి): కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ ఎస్సై ఏ. నరేశ్ కుమార్‌కు జిల్లాస్థాయిలో ఉత్తమ సబ్‌ఇన్‌స్పెక్టర్ అవార్డు లభించింది. ఇటీవల సూరంపేట గ్రామం లో జరిగిన రాబరీ కేసును అత్యంత వేగంగా ఛేదించడంతో పాటు, పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఎస్సై నరేష్ కుమార్‌ను అభినందించారు.

భూముల రీ-సర్వే పైలెట్ ప్రాజెక్టుగా లింగంపేట గ్రామం ఎంపిక

- రీ-సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ సుప్రియ హరీష్ రెడ్డి



భీమారం, నవంబర్ 13 (ప్రజాజ్యోతి): భూములరీ–సర్వే కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని లింగంపేట గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన భూముల రీ–సర్వే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సుప్రియ హరీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ–సర్వేను గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా రైతులు తమ భూముల సరిహద్దులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ వసంత, డీఐ సాయిలు, సర్వేయర్ మహేష్, ఆర్ఐ వినోద్, ఏఎంసీ వైస్ చైర్మన్ మిట్టపల్లి రాజారెడ్డి, వార్డు సభ్యుడు లోకేష్, జీపీఓ నరేష్‌తో పాటు గ్రామస్తులు అరుణ్, సల్మాల శేఖర్, జవ్వాజి రాజేందర్, చిన్న సాయిరెడ్డి, జల పతి రెడ్డి, మిట్టపల్లి లింగారెడ్డి, నారాయణ రెడ్డి, చింతకింది రాజం, కోటగిరి శంకర్, శ్రీపాల్ రెడ్డి, వెల్మల లక్పతి రెడ్డి, కేతిరెడ్డి లింగారెడ్డి, కత్తెరపాక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

19వ వార్డులో నిరుపేద మహిళ ఇంటి కూల్చివేతపై

బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల తీవ్ర ఆగ్రహం





- బాధిత మహిళ మారు పాక రజిత కుటుంబానికి అండగా నిలిచిన ఇరు పార్టీల కౌన్సిలర్లు
- ఇంటిని తిరిగి నిర్మించే వరకు పోరాటం చేస్తాం బీజేపీ మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఇందూరి తిరుమల వాసు
- పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణం బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల, నవంబర్ 13 ప్రజాజ్యోతి కోరుట్ల మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో చెరువు సమీపంలో నివాసం ఉంటున్న నిరుపేద మహిళ మారు పాక రజిత ఇంటిని మున్సిపల్ అధికారులు కూల్చివేసిన ఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని పేర్కొంటూ గురువారం మున్సిపల్ అధికారులు జేసీబీ సహాయంతో ఇంటిని కూల్చివేయడంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక నిరుపేద మహిళ తన పిల్లలతో కలిసి నివసిస్తున్న ఇంటిని కూల్చివేయడంతో ఆ కుటుంబం నిలువనీడ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఇరు పార్టీలకు చెందిన కౌన్సిలర్లు, నాయకులు వేర్వేరుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంఘీభావం ప్రకటించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

– బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ కౌన్సిలర్లు

ఈ ఘటన నేపథ్యంలో బీజేపీ మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఇందూరి తిరుమల వాసు ఆధ్వర్యంలో బీజేపీ కౌన్సిలర్లు కలాల రాధా సాయిచంద్, సోరూపాక రమాదేవి, రమేష్, గుగులోతు శ్రీకాంత్ తదితరులు బాధిత మహిళ మారుపాక రజితను కలిసి పరామర్శించారు.ఇంటి కూల్చివేతకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిని కోల్పోయిన మహిళకు, ఆమె పిల్లలకు ధైర్యం చెప్పి భారతీయ జనతా పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఇందూరి తిరుమల వాసు మాట్లాడుతూ నిరుపేద మహిళ నివసిస్తున్న ఇంటిని కూల్చివేయడం బాధాకరమని పేర్కొన్నారు. చట్టపరమైన అంశాలు ఏవైనా ఉన్నప్పటికీ బాధిత కుటుంబ పరిస్థితిని కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటిని కోల్పోయిన కుటుంబం ఎక్కడ ఆశ్రయం పొందాలనే విషయాన్ని కూడా ఆలోచించాలని అన్నారు.

– భూకబ్జాదారుల అక్రమాలపై బీజేపీ ఆరోపణలు

కొంతమంది భూకబ్జాదారులు మోసపూరితంగా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకొని, బాధిత మహిళను అక్కడి నుంచి ఖాళీ చేయించాలనే ఉద్దేశంతో న్యాయపరమైన ప్రక్రియలను ఉపయోగించుకున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పేద ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి నివాస స్థలాల విషయంలో అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన భూమి రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, న్యాయపరమైన అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.

– మతం పేరుతో దూషిస్తే సహించేది లేదు బీజేపీ

బాధిత మహిళ హిందువు అనే కారణంతో ముస్లిం ప్రాంతంలో నివసించ కూడదంటూ కొందరు దుర్భాషలాడినట్లు తమ దృష్టికి వచ్చిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరపాలని కోరారు.కోరుట్ల పట్టణంలో అన్ని మతాల ప్రజలకు సమాన హక్కులు ఉన్నాయని, మతం ఆధారంగా ఎవరినీ అవమానించడం, వివక్ష చూపడం సరికాదని తెలిపారు. మతసామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఎవరు వ్యవహరించినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను అవమానించే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు.

– అదే స్థలంలో ఇంటిని నిర్మించే వరకు పోరాటం ఇందూరి తిరుమల వాసు

బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటం కొనసాగిస్తుందని బీజేపీ మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఇందూరి తిరుమల వాసు స్పష్టం చేశారు. బాధితురాలికి అదే స్థలంలో తిరిగి ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. నిరుపేద కుటుంబానికి తగిన న్యాయం చేయడంతో పాటు నివాస సౌకర్యం కల్పించే విషయంలో అధికారులు స్పందించాలని కోరారు.

– పేదల ఇళ్లను కూల్చడం దారుణం.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు

మరోవైపు 19వ వార్డులో మారుపాక రజిత అనే నిరుపేద మహిళ ఇంటిని మున్సిపల్ అధికారులు కూల్చివేయడాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీవ్రంగా ఖండించారు. పేద కుటుంబం నివసిస్తున్న ఇంటిని కూల్చివేయడం దారుణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు వసీం, మోసిన్, పొట్ట సురేందర్, కొక్కెర వెంకటేష్, టేకుల శిరీష, ఎలుగూరి శ్వేత తదితరులు బాధిత మహిళను కలిసి పరామర్శించారు. ఇంటిని కోల్పోయిన కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి సంఘీభావం ప్రకటించి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.పేద ప్రజలు ఎన్నో కష్టాలు పడి నిర్మించుకున్న ఇళ్లను కోల్పోతే వారి పరిస్థితి దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లలు ఉన్న కుటుంబాలు నివాసం కోల్పోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.

– బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఆర్థిక సాయం

19వ వార్డులో నిరుపేద మహిళ ఇంటిని కూల్చివేసిన విషయం తెలుసుకున్న కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించినట్లు బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలిపారు.ఇంటిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. నిరుపేద కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, బాధితురాలికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

– బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఇరు పార్టీల డిమాండ్

ఇంటి కూల్చివేత ఘటనపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా స్పందించినప్పటికీ బాధిత నిరుపేద మహిళకు న్యాయం జరగాలనే డిమాండ్‌ను వ్యక్తం చేశారు. ఒక మహిళ తన పిల్లలతో కలిసి నివసిస్తున్న ఇంటిని కోల్పోవడం బాధాకరమని, బాధిత కుటుంబానికి తక్షణమే అవసరమైన సహాయం అందించాలని కోరారు.ఇంటి కూల్చివేతకు దారితీసిన పరిస్థితులు, భూమికి సంబంధించిన వివాదం, న్యాయస్థానం ఆదేశాలు, మున్సిపల్ అధికారులు చేపట్టిన చర్యలపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.బాధితురాలి సమస్యకు చట్టపరంగా పరిష్కారం చూపాలని కోరారు.

– రాజకీయాలకు అతీతంగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలనే విజ్ఞప్తి

నిరుపేద మహిళ ఇంటి కూల్చివేత ఘటన నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఇంటిని కోల్పోయిన మహిళకు, ఆమె పిల్లలకు తాత్కాలిక నివాస సౌకర్యం కల్పించడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.బీజేపీ నాయకులు ఇంటిని తిరిగి నిర్మించే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించగా, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అందించిన ఆర్థిక సహాయాన్ని ప్రస్తావిస్తూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.